వసతి.. అధోగతి!

- సమస్యలకు నిలయంగా సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్
- ధ్వంసమైన తలుపులు, కిటికీలు
- దుర్గంధభరితంగా మారిన మరుగుదొడ్లు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీ సమీపంలోగల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల (ఎస్సీ) వసతిగృహం అధ్వానంగా మారింది. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరం కావొద్దన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వసతిగృహాల్లో చేర్పిస్తున్నారు. అయితే సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వసతిగృహం ఎదుట మురికి కూపంగా మారి పందులకు ఆవాసంగా మారింది. వసతిగృహం తలుపులు ధ్వంసం కావడంతో విషసర్పాల బెడద నెలకొంది. మరుగుదొడ్లు కొన్ని పూర్తిగా ధ్వంసం కాగా, మరికొన్ని దుర్గంధభరితంగా మారాయి. దీంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వసతిగృహం కిటికీలు ధ్వంసం కావడంతో విద్యార్థులు చలికి వణుకుతూ కాలం వెల్లదీస్తున్నారు. దుప్పట్లు, దుస్తులతో కిటికీలను మూసివేయాల్సిన పరిస్థితి ఉంది. అసలే వర్షాకాలం కావడంతో దోమల బెడదతో అల్లాడుతున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. వసతిగృహం గోడకు ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం వల్ల గతంలో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంచాలు, పుస్తకాలు దగ్ధమయ్యాయి. శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కవితాదేవి బాలుర కళాశాల వసతిగృహాన్ని సందర్శించి పరిశీలించారు. అక్కడ ధ్వంసమైన మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలను చూసి వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తలుపులు, కిటికీలను సరి చేయించాలని, మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని ఆదేశించారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం

పట్టించుకోని అధికారులు..

వసతిగృహంలో నెలకొన్న సమస్యలను సంక్షేమశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. వసతిగృహానికి అధికారులు వచ్చి పరిశీలిస్తున్నారనే తప్ప సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు ఉన్న జిల్లా కేంద్రంలోనే వసతిగృహాల పరిస్థితి ఈ విధంగా ఉంటే.. మండలాల్లోని వసతిగృహాల దుస్థితి ఏ మేర ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా.. బీసీ బాలుర కళాశాల వసతిగృహం శిథిలావస్థకు చేరగా, విద్యార్థులను సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి తరలించారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


ధ్వంసమైన హాస్టల్ తలుపులు


వసతిగృహం పక్కన మురుగునీటి గుంత

నేను వచ్చి రెండు వారాలే అవుతుంది..

నేను వసతిగృహం ఇంచార్జ్ వార్డెన్‌గా వచ్చి రెండు వారాలు అయింది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వసతిగృహం ఎదుట మురుగునీటి గుంటగా మారిన మాట వాస్తవం. సంక్షేమశాఖ జిల్లా అధికారి, డిజివినల్ అధికారి వసతిగృహాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో వసతిగృహానికి మరమ్మతు చేయిస్తామన్నారు. – చంద్రబ్, వార్డెన్

క్లుప్తంగా

శిథిలావస్థలో బిజ్వారం పశువైద్యశాల



మల్దకల్: మండలంలోని బిజ్వారం పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. 20ఏళ్ల కిందట నిర్మించిన పశు వైద్యశాల భవనం పైకప్పు పెచ్చులూడిపోయింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. పశు వైద్యశాల భవనానికి మరమ్మతు చేయించాలని అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

ఆలయానికి బంగారం వితరణ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం పాగుంటకు చెందిన కుర్వ ఆంజనేయులు రెండు గ్రాముల బంగారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

గద్వాల: మణిపూర్ ఘటనను నిరసిస్తూ అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సుధాకర్ ఆదివారం ప్రకటనలో పేర్కొపారు. రెండవ రైల్వేగేట్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని క్రైస్తవులు తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలి



గట్టు: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బోయలగూడెంలో శనివారం రాత్రి ఆ సంఘం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లింగన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడమే లక్ష్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాల్మీకులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బల్గెర హనుమంతు, కోటేష్, రాములు, న్యాయవాది మధుసూదన్‌బాబు, గద్వాల రామాంజనేయులు, మేకల తిమ్మప్ప, నాగశంకర్, భాస్కర్, వీరేష్, దేవదాసునాయుడు, రామాంజనేయులు, గూపద్‌నాయుడు, గట్టు మండల అధ్యక్షుడు రామునాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

స్వకులశాలి సంఘం అధ్యక్షుడికి సన్మానం



గద్వాల అర్బన్: స్వకులశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన స్థానిక చేనేత సంఘం అధ్యక్షుడు రామలింగేశ్వర కాంశ్లేను ఆదివారం జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులు, చేనేత కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు నర్సింహులు, మాకం బాలరాజు, రామకృష్ణ, నాగరాజు, భీమేష్, శంకర్, నీలి శేఖర్, గోపాల్, రాజేష్ పాల్గొన్నారు.

భగవద్గీతపై అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2వ సెంటర్‌లో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా ఆదివారం భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడని పేర్కొన్నారు. గ్రామస్తులకు భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, స్వప్న, అలివేలు, లలిత, నాగరత్నం, కృష్ణయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి


మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మానవపాడు: గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు జల్లాపురం వెంకటేశ్వర్లు వనపర్తి జిల్లా కేంద్రంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 325 యూనిట్లు మంజూరు కాగా, 250 యూనిట్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. అర్హులందరికీ గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని కోరారు. జల్లాపురం జాతీయ రహదారి నుంచి చందూరు వరకు బీటీరోడ్డు రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫాగింగ్ తప్పనిసరి

అలంపూర్ రూరల్: గ్రామాల్లో దోమల నివారణకు తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలని ఎంపీడీఓ చంద్రకళ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయించి పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. మురుగునీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. ప్రజలు దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

అయిజ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య మాట్లాడుతూ గురుకుల హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించేందుకుగానూ డైట్ చార్జీలను పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి సహకరించాలి

అలంపూర్ రూరల్: పద్మశాలి సంఘం బలోపేతానికి అందరూ సహకరించాలని ఆ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, కుంటుమల్ల మారుతి కోరారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి కుటుంబ సభ్యులందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్లె శ్రీనివాసులు, సర్వేశ్వర్, నర్సింహ, నాగరాజు, నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ, ఎమ్మార్సీ తదితర కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు పక్కన కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

చిన్నారులకు చేయూత



అయిజ: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రవీణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి పిల్లల చదువు నిమిత్తం ఆదివారం యూనిక్ స్పోర్ట్స్–అయిజ మిత్ర బృందం రూ.50వేలు, ఆటో యూనియన్ సభ్యులు రూ.13వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ రవీంద్ర ధీర, ప్రభు, వీరేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాలు



అలంపూర్ రూరల్: మొహర్రం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోన్ని చావిడిలో కొలువుదీరిన పీర్లను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రం ఉత్సవాలతో చావిడి వద్ద సందడి నెలకొంది.

దరఖాస్తుల ఆహ్వానం

పెబ్బేరు/అమరచింత: పండ్ల తోటల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని పెబ్బేరు ఏఈఓ చంద్రమౌళి, అమరచింత ఏపీఓ బాలయ్య ఆదివారం వేర్వేరుగా ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరంలో పండ్ల తోటలు వేసుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదెకరాలలోపు ఉన్న అనువైన భూమి కలిగి జాబ్‌కార్డు ఉన్న ప్రతి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, చిన్న, సన్న కారు రైతులు అర్హులని వివరించారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్‌కార్డు, జిరాక్స్‌లతో పాటు ఫొటోలు మూడు, గ్రామ పంచాయతీ తీర్మానం ఉండాలని తెలిపారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అయ్యప్పస్వామికి అభిషేకం



ఉండవెల్లి: ఉత్తర నక్షత్రం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయశర్మ, గురుస్వాములు దామోదర్‌రెడ్డి, సూర్యకాంతారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న గూడ్స్ వాహనం

మల్దకల్: ప్రజల ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు చెలగాటమాడుతున్నారు. గూడ్స్ వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వ్యవసాయ పనుల నిమిత్తం కర్ణాటక నుంచి కూలీలను తరలిస్తున్నారు. ఒక్కో వాహనంలో 20–40మందికిపైగా కూలీలను ఎక్కించుకుంటున్నారు. దీంతో కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి


బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అయిజ: స్వాతంత్య్ర సమరయోధులను అందరూ స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ దేశ చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, వీరయ్య, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, శివన్న, అంజి, పరశురాం, రఘు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించండి


మానవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల ఆవరణలో పశువులు, గొర్రెలు సంచరిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా మారుతోందని, కళాశాల ఆవరణలో నాటిన మొక్కలను పశువులు మేస్తున్నాయని తెలిపారు. ప్రహరీ నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నత్తనడకన డ్రెయినేజీ పనులు


డ్రెయినేజీ నిర్మాణానికి తీసిన కాల్వ

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరంలో పంచాయతీ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు 360 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణానికిగానూ నెలరోజుల కిందట కాల్వను తవ్వి వదిలేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో కాల్వలోకి నీరు చేరి నిల్వ ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడి పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నాగేంద్రమ్మను వివరణ కోరగా.. పంచాయతీలో రూ.13లక్షల నిధులు ఉన్నాయని, కొంత బడ్జెట్‌తో మూడు చోట్ల డ్రెయినేజీ, కల్వర్టుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మిషనరీ, కూలీల కొరతతో పనుల్లో జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

శాంతినగర్: ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జయంతి వెంకటేశ్వర్లు సూచించారు. శాంతినగర్ కన్యకా పరమేశ్వరిదేవి కల్యాణ మండపంలో ఆదివారం హైదరాబాద్ రెనోవా ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఆస్పత్రి వైద్యులు గుండె, ఎముకలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మొత్తం 210 మంది శిబిరానికి హాజరైనట్లు వాసవీ క్లబ్ శాంతినగర్ అధ్యక్షుడు సప్తగిరి శ్రీనివాసులు తెలిపారు. ఐదుగురు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి డెంటల్, రెనోవా ఆస్పత్రుల వైద్యులు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, రమేష్, సత్యం, రావూరి సురేష్‌కుమార్, గాయత్రి, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

తాగునీటిని వృథా చేయొద్దు



వాటర్ ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

అయిజ: వాటర్ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న తాగునీటిని వృథా చేయొద్దని మున్సిపల్ ఏఈ గోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని వివిధ కాలనీలకు తాగునీటిని సరఫరా చేసేందుకు మూడు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పెద్దవాగుపై ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైన నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పునరుద్ధరించే వరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

రక్షణ కల్పించాలి

గద్వాల అర్బన్: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు అడ్డుకట్ట వేసి పౌరులకు రక్షణ కల్పించాలని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరుశరాముడు కోరారు. జిల్లా కేంద్రంలోని గంజిపేటలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు భాస్కర్, అఖిల్, వెంకటేష్, బాలరాజు, జమ్మన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన మంగళి రాజశేఖర్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు ఆదివారం బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పోతురాజు సోమనాద్రి సూచన మేరకు అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దేవన్న తదితరులు పాల్గొన్నారు.